క్లుప్తంగా

అమలాపురం లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా గణపతి



అమలాపురం రూరల్: స్థానిక లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక ఏకగ్రీవంగా ఎన్నికైయింది. 2025–2026 సంవత్సరానికి అమలాపురం లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా పేరూరు కొంకాపల్లి చెందిన సుదా గణపతి ఎన్నికయ్యారు. శనివారం అమలాపురం లయన్స్ క్లబ్ హాలులో నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం జరుగుందని ప్రస్తుత అధ్యక్షుడు రవణం వేణుగోపాలరావు తెలిపారు. ఉపాధ్యక్షులుగా చిక్కాల సతీష్, గోకరకొండ నాగేంద్రరావు, కార్యదర్శిగా బెహరా వీర హనుమంతరావు, కోశాధిరిగా గుత్తుల నాగేశ్వరరావు, సంయుక్త కార్యదర్శిగా సుగ్గ సత్య గోపాల కృష్ణ కుమార్, జాయింట్ ట్రెజరర్‌గా పట్నాల వెంకటరమణ, ఐపీపీఎల్‌సీఎఫ్ రవణం వేణుగోపాలరావు, ఇతర కమిటీ సభ్యులు 15 మంది ఎన్నికయ్యారు. ఈ ప్రమాణ సీకార మహోత్సవానికి ఎమ్మెల్సీలు కుడుపూడి సూర్యనారాయణరావు, బొమ్మి ఇజ్రాయిల్, వైఎస్సార్ సీపీ అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గం ఇన్‌చార్జి పినిపే శ్రీకాంత్ తదితరులు ముఖ్యఅతిథులుగా హాజరవుతారన్నారు. వెఎస్సార్ సీపీ మండల ఉపాధ్యక్షుడు ప్రధాన కార్యర్శిగా పని చేసి వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధిగా పనిచేస్తున్నారు.

భూమి అక్రమ రిజిస్ట్రేషన్‌పై పోలీసులకు ఫిర్యాదు

ముమ్మిడివరం: తన తల్లి పేరు మీద ఉన్న భూమిని మరో మహిళ వేరే వారికి అక్రమంగా రిజిష్టేషన్ చేశారని రాజమహేంద్రవరానికి చెందని రిటైర్డ్ జైలర్ ఎం.భోగేశ్వరరావు ముమ్మిడివరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనికి సంబంధించి ముమ్మిడివరం ఎస్సై డి.జ్వాలాసాగర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రాజమండ్రిలో పిడింగొయ్యిలో తన తల్లి విజయలక్ష్మి పేరిట 13 సెంట్ల 99 గజాలు భూమి ఉందని, అయితే ఆ భూమిని పెద్దాపురానికి చెందిన గంధం గంగాభవాని అనే మహిళ గత నెల 18న ముమ్మిడివరం సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులో వేరే వాళ్లకు రిజిష్ట్రేషన్ చేయించిందని భోగేశ్వరరావు పోలీసులకిచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై ముమ్మిడివరం ఎస్సై జ్వాలాసాగర్ కేసు నమోదు చేసి గురువారం ముమ్మిడివరం సబ్ రిజిష్ట్రేషన్ కార్యాలయంలో సబ్ రిజిస్ట్రార్, సిబ్బందిని, లేఖరిని విచారించారు.

పర్యావరణ పరిరక్షణలో మహిళల పాత్ర కీలకం



సమావేశంలో మాట్లాడుతున్న ఉమాలక్ష్మి

ముమ్మిడివరం: మహిళలు కుటుంబ నిర్వహణతోపాటు పర్యావరణ పరిరక్షణలో ప్రముఖ పాత్ర పోషిస్తారని జిల్లా బాలల పరిరక్షణ అధికారిని బి.ఉమాలక్ష్మి అన్నారు. బెంగుళూరుకి చెందిన ఇండియన్ సోషల్ ఇనిస్టిట్యూట్ వారి సహకారంతో కార్లి మ్యాట్ సిస్టర్స్ ఆఫ్ తెరిసా, పీపుల్స్ సర్వీస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ముమ్మిడివరం ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో గురువారం పీపుల్స్ సర్వీస్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు కర్నీడి వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. మహిళలకు రాజ్యాంగం ద్వారా సమాన వేతనాలు, వెటర్నెటీ హక్కు, గృహ హింస, లైంగిక వేధింపుల నుంచి నిరోధనాలు, ఆస్తి వారసత్వ హక్కు లభించిందన్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాల ఐఎస్ఐ కోఆర్డినేటర్ కోఆర్డినేటర్ జి.కరుణాకరరావు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు వలంటీర్లు పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపు

కాట్రేనికోన: గ్రామ ఆర్టీసీ బస్సు షెల్టరులో ఆక్రమణల తొలగింపునకు ఆర్టీసీ ఉన్నధికారులు చర్యలు చేపట్టారు. ప్రయాణికులకు ఎంత మాత్రం ఉపయోగం లేకుండా బస్సు షెల్టరులో మోటారుసైకిళ్లు, పూలు, పండ్లు బండ్లతో ఆక్రమించుకోవడంపై గ్రీవెన్సు ఫిర్యాదు చేశారు. గ్రీవెన్సు ఫిర్యాదుపై స్పందించిన రీజనల్ మేనేజర్ ఎస్‌టీపీ రాఘవ కుమార్, ఆర్టీసీ డిపో మేనేజర్ చల్లా సత్యనారాయణ మూర్తిలు గురువారం బస్సు షెల్టరు ఆక్రమణలు పరిశీలించారు. ఆర్టీసీ మనందరిదని ప్రయాణికుల విశ్రాంతి కోసం షెల్టరు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు.

హత్యా రాజకీయాలకు ఆద్యుడు చంద్రబాబే

తాళ్లరేవు: కుప్పంలో జరిగిన కార్యక్రమంలో సింగయ్య మృతిని మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ఆపాదిస్తూ వైఎస్ వివేకానందరెడ్డి హత్యా ఉదంతాన్ని ప్రస్తావిస్తూ ఆయనపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్న చంద్రబాబే హత్యా రాజకీయాలకు ఆద్యుడని వైఎస్సార్ సీపీ యువజన విభాగం అధికార ప్రతినిధి వుంగరాల సంతోష్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. చంద్రబాబు తానెప్పుడూ హత్యా రాజకీయాలు చేయలేదని, రాజకీయాల్లో నేరస్తులు ఎక్కువైపోయారని వ్యాఖ్యానించడం హాస్యాస్పదంగా ఉందని, ఆయన అలా మాట్లాడడం దెయ్యాలు వేదాలు వల్లించినట్టు ఉందన్నారు. చంద్రబాబు రాజకీయ ప్రస్థానమే వెన్నుపోట్లు, హత్యలు, మోసాలతో నడిచిందని ఆరోపించారు. అనేక మంది హత్యలు టీడీపీ ప్రభుత్వంలో జరిగాయన్నారు. చంద్రబాబు గతంలో మామ ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచారని, ఇప్పుడు రాష్ట్ర ప్రజలకు వెన్నుపోటు పొడిచారని సంతోష్ విమర్శించారు.

స్క్రీనింగ్ పరీక్ష.. బిడ్డకు రక్ష

- నవజాత శిశువులకు టెస్టులు తప్పనిసరి
- మొదట్లోనే వ్యాధుల గుర్తింపు
- చేయకుంటే జీవితాంతం ఇబ్బంది
- ఆరోగ్యవంతమైన జీవితానికి పరీక్షలు ముఖ్యం



నవజాత శిశువు (ఫైల్)



కాట్రేనికోన: పాదం చిన్నదైనా ప్రతి అడుగు జీవితం వైపు ఉంటుంది. నవజాత శిశువులకు ప్రాథమికంగా నిర్వహించే స్క్రీనింగ్ పరీక్షలు తప్పనిసరిగా చేయించాలి. ఈ పరీక్షలు బిడ్డ ఆరోగ్యనికి శ్రీరామ రక్షని ఉభయ తెలుగు రాష్ట్రాల ల్యాబ్ ఐక్యూ హెడ్ ఆఫ్ మాలక్యులర్ డయగ్నోసిస్ వైద్యులు వి.మహేష్ సూచించారు. నవజాత శిశువు పుట్టగానే ఆరోగ్య సమస్యలను అంతగా గుర్తించలేరు. అయితే బిడ్డ శరీరంలోని జన్యు, హార్మోన్స్ లోపాలు, మెటబాలిక్ వ్యాధులను మొదట్లో గుర్తించకపోతే తర్వాత తీవ్ర ఆరోగ్య సమస్యలను ఎదుర్కొవాల్సి ఉంటుంది. అందుకే స్క్రీనింగ్ పరీక్షలు చేయించాలి. ఈ వ్యాధులను మొదట్లోనే గుర్తించకపోతే జీవితాంతం ఆసుపత్రులు చుట్టూ తిరగాల్సి ఉంటుంది. మానసిక, శారీరక సమస్యలు తలెత్తడంతో పాటు దీర్ఘ కాలిక వ్యాధులు వస్తాయి. నవజాత శిశువు పుట్టిన 40–72 గంటలలోపు పాదం నుంచి రక్త నమూనా సేకరించి, స్క్రీనింగ్ పరీక్షల ద్వారా సాధారణంగా కన్పించని వ్యాధులను గుర్తించవచ్చునన్నారు. బిడ్డ పాదం నుంచి రక్త నమూనా స్వీకరించడంతో బిడ్డకు ఎలాంటి బాధ ఉండదన్నారు. రక్త నమూనా సేకరించి పరీక్షలు చేయించడం ద్వారా గంటల వ్యవధిలో ఫలితాలు వస్తాయన్నారు.

స్క్రీనింగ్ పరీక్షలు ఇవే..

నవజాతి శిశువుకు 40–72 గంటల లోపు బిడ్డ పాదం నుంచి రక్త నమూనాను సేకరించి ప్రథమంగా కొన్ని వ్యాధులను గుర్తించేందుకు పరీక్షలను చేయాలి.

కాంగ్జెనిటాల్ హైపోథైరాయిడిజం(సీహెచ్)

నవజాత శిశువు పుట్టుకతో థైరాయిడ్ హార్మోన్ లోపంతో వచ్చే వ్యాధి హైపోథైరాయిడిజం. ఈ వ్యాధికి ప్రారంభ చికిత్స చేయకపోతే తీవ్రమైన సమస్యలకు దారి తీస్తుంది. ప్రారంభ రోగ నిర్ధారణ, చికిత్సలతో పిల్లలు సాధారణ జీవితం గడపవచ్చు. నవజాత శిశువులలో ఈవ్యాధిని గుర్తించేందుకు స్క్రీనింగ్ పరీక్షలు తప్పనిసరి.

కాంగ్జెనిటెల్ అడ్రినల్ హైపర్‌ప్లేషియా (సీఏహెచ్)

సీఏహెచ్ వ్యాధి పుట్టకతో వారసత్వంగా వచ్చే రుగ్మతల సమాహం. అడ్రినల్ గ్రంథులు హార్మోనుల ఉత్పత్తి సక్రమంగా జరగదు. దీనివల్ల ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొవాల్సి ఉంటుంది.

ఫినిల్కిటోన్యూరియా(పీకేయూ)

బిడ్డలో వచ్చే జన్యుపరమైన రుగ్మత పీకేయూ పరీక్షలను నవజాత శిశువు పుట్టిన వెంటనే నిర్వహిస్తారు. ఈ సమస్యను చిన్న వయస్సులో గుర్తించి చికిత్స అందిస్తే సామాన్యమైన జీవితాన్ని గడుపుతారు.

జీ6 పీడీ లోపం

గ్లూకోజ్ 6 ఫాస్ఫేట్ డీహైడ్రోజినేస్ అనే ఎంజైమ్ లోపం వల్ల కలిగే ఒక జన్యు పరమైన రుగ్మత. ఇది ఎర్ర రక్త కణాల విచ్ఛిన్నతకు దారి తీస్తుంది. దీని వలన (అనీమియా) రక్త హీనత వచ్చే పరిస్థితులు ఉండవచ్చు.

గాలాక్టోసీమియా

గెలాక్టోసీమియా జన్యుపరమైన రుగ్మత. ఈ వ్యాధితో శరీరం గెలాక్టోజ్ను సక్రమంగా జీర్ణం చేయదు. గెలాక్టోజ్ పాలలో ఒక భాగం కావడంతో పాల ఉత్పత్తులను తీసుకున్నపుడు శరీరంలో గెలాక్టోజ్ పేరుకు పోతుంది.

తల్లిపాలతోనే వ్యాధి నిరోధక శక్తి

నవజాత శిశువుకు తల్లిపాలు పట్టించండంతో వ్యాధి నిరోధక శక్తి పెంపొందిస్తుందని వైద్యులు చెబుతున్నారు. తల్లులు బాహ్య సౌందర్యం పాడవుతుందనే సాకుతో బిడ్డకు ముర్రు పాలు ఇవ్వడం లేదన్నారు. అత్యంత పోషక విలువలు ఉన్న తల్లి ముర్రుపాలు నవజాత శిశువుకు మొదటి టీకా వంటిదని వైద్యులు చెబుతున్నారు. తల్లి పాలు విశిష్టతపై మహిళలకు అవగాహన కల్పించాల్సిన అవశ్యకత ఎంతైనా ఉందన్నారు. తల్లి ముర్రు పాలు చిక్కగాను, పసుపు రంగులోను ఉంటాయని, ముర్రు పాలు రోగ నిరోధక శక్తిని కలిగి ఉండడంతో బిడ్డ వ్యాధులబారిన పడకుండా సంపూర్ణ ఆరోగ్యవంతంగా జీవిస్తారన్నారు. బిడ్డ జీవితం ప్రారంభమయ్యే ముందు స్క్రీనింగ్ పరీక్షలు, తల్లి పాలతో పాటు వైద్యులు సలహాలు పాటిండం ద్వారా ఆరోగ్యాన్ని సులభంగా రక్షించుకోవచ్చునన్నారు.

వ్యాధులు గుర్తించవచ్చు



నవజాత శిశువుకు రక్త నమూనాను సేకరించి స్క్రీనింగ్ పరీక్షలు చేయించడం ద్వారా శరీరంలోపల దాగి ఉన్న దీర్ఘ కాలిక వ్యాధులను గుర్తించవచ్చు. బిడ్డ ఆరోగ్యవంతమైన జీవితానికి ముందస్తు పరీక్షలు తప్పనిసరి చేయించాలి

–డా.వి.మహేష్, ల్యాబ్ ఐక్యూ హెడ్‌మాలక్యులర్ డయగ్నోసిస్ వైద్యులు

తల్లి పాలే శ్రేయస్కరం



పుట్టిన బిడ్డకు తల్లి ముర్రు పాలు ఇవ్వడం శ్రేయష్కరం. బిడ్డ సంపూర్ణ ఆరోగ్యం కోసం తల్లి ముర్రు పాలు పట్టించాల్సి ఉంది. చిక్కగాను, పసుపు పచ్చ రంగులో ఉన్న తల్లి పాలలో అనేక పోషక విలువలు కలిగి ఉన్నాయి. రోగ నిరోధక శక్తి కలిగిన ఈ పాలు బిడ్డకు పట్టించడంతో ద్వారా బిడ్డ ఆరోగ్యవంతంగా జీవిస్తుంది.

– డాక్టర్ భావన, కాకినాడ

ఎర్ర చందనం చెట్టు నరికివేత

బాధ్యులపై కేసు నమోదు చేసిన ఫారెస్టు అధికారులు



సమతానగర్‌లో విచారణ నిర్వహిస్తున్న ఫారెస్ట్ అధికారులు

అమలాపురం టౌన్: పట్టణం సమతానగర్‌లో ఉన్న ఎర్ర చందనం చెట్టును అనుమతి లేకుండా నరికేస్తున్నారన్న సమాచారంతో ఫారెస్టు అధికారులు ఘటన స్థలానికి గురువారం చేరుకుని విచారణ చేపట్టారు. ఎర్ర చందనం చెట్టును నరకడాన్ని అధికారులు అడ్డుకున్నారు. అప్పటికే చెట్టును సగానికి పైగా నరికేయడంతో బాధ్యులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అప్పటికే నరికిన చెట్టు తాలూకు 8 కొమ్మలను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఆ కలపను భద్రత కోసం రెవెన్యూ అధికారులకు అప్పగించారు. ఓ ఇంటి యాజమాని చెట్టును నరకించే ఏర్పాట్లు చేసినప్పటికీ ఆయన అందుబాటులో లేకపోవడంతో స్థానికులతో స్టేట్ మెంట్లు రికార్డు చేశారు. డిప్యూటీ ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ బీఎన్ సత్యనారాయణ ఆధ్వర్యంలో ఆ డిపార్ట్‌మెంట్ అధికారులు యు.శ్రీనివాస్, బి.శ్రీనివాస్‌లు ఘటనా స్థలంతో చెట్టు నరికివేతపై దర్యాప్తు చేశారు. అప్పటికే నరికిన ఎర్ర చందనం కొమ్మలు దాదాపు రూ.10 లక్షల విలువ ఉంటుందని తెలిసింది. అనుమతులు లేకుండా ఈ తరహా చెట్లను నరకకూడదని, నరికిన వారిపై తమ శాఖ చట్టరీత్యా చర్యలు తీసుకుంటుందని డిప్యూటీ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ సత్యనారాయణ తెలిపారు.

మున్సిపాలిటీకి ఆవుల తరలింపు

యజమానులకు జరిమానా



ఆవులను పరిశీలిస్తున్న పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకులు విజయరెడ్డి తదితరులు

అమలాపురం టౌన్: అమలాపురం పట్టణం రోడ్లపై విచ్చలవిడిగా తిరుగుతూ రోడ్డు ప్రమాదాలకు కారణమవుతున్న ఆవులు, వాటి యాజమానులపై మున్సిపాలిటీ చర్యలు మొదలు పెట్టింది. ఇందులో భాగంగా రోడ్లపై సంచిరిస్తున్న కొన్ని ఆవులను మున్సిపాలిటీ సిబ్బంది బంధించి పట్టణంలో ఓ చోట రక్షణ ఏర్పాట్లు చేశారు. మీ ఆవులను రోడ్లపై వదలొద్దని, ఇల్లు లేదా మకాం వద్ద వాటిని కట్టడి చేసుకోవాలని మున్సిపాలిటీ గత నెల 26, 27 తేదీల్లో పట్టణమంతా ఆటో ద్వారా మైక్ అనౌన్స్‌మెంట్ చేయించిందని మున్సిపల్ కమిషనర్ వి.నిర్మల్‌కుమార్ తెలిపారు. గత నెల 30వ తేదీన పట్టణంలోని రోడ్లపై ఉన్న కొన్ని ఆవులను మున్సిపాలిటీ బంధించింది. మున్సిపాలిటీ ఆధీనంలో ఉన్న ఆ ఆవులను అమలాపురం పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ ఎల్.విజయరెడ్డి పరిశీలించి వైద్య పరీక్షలు చేశారు. చివరకు ఆవుల తాలూకు యాజమానులు కొందరు రావడంతో వారికి జరిమానాలు విధించినట్లు కమిషనర్ నిర్మల్‌కుమార్ తెలిపారు. ఇక మీదట పశువులను రోడ్లపై వదలిస్తే అలాంటి పశువులను ముఖ్యంగా ఆవులను గోశాలలకు తరలించే ఏర్పాట్లు చేస్తామని కమిషనర్ హెచ్చరించారు.

పశుగ్రాస క్షేత్రాలతో నాణ్యమైన పాల దిగుబడి



అమలాపురంలో వేసిన మినీ పశుగ్రాస క్షేత్రాన్ని పరిశీలిస్తున్న నేచురల్ ఫార్మింగ్ అధికారులు

అమలాపురం టౌన్: పశు వైద్యశాలల ప్రాంగణాల్లో సేంద్రియ పద్ధతుల్లో పెంచుతున్న మినీ పశుగ్రాస క్షేత్రాలతో పాడి పశువుల నుంచి నాణ్యమైన పాల దిగబడిని పొందవచ్చని నేచురల్ ఫార్మింగ్ డిస్ట్రిక్ట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ శ్రీనివాసరావు సూచించారు. అమలాపురం ప్రాంతీయ పశు వైద్యశాల వెనుక పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ ఎల్.విజయరెడ్డి అభివృద్ధి చేస్తున్న సేంద్రియ మినీ పశుగ్రాస క్షేత్రాన్ని శ్రీనివాసరావు గురువారం సందర్శించారు. ఆయనతో పాటు జిల్లా ప్రాజెక్ట్ అడిషనల్ ప్రాజెక్ట్ ఆఫీసర్ సత్యనారాయణ కూడా క్షేత్రాన్ని సందర్శించి పరిశీలించారు. మినీ పశుగ్రాస క్షేత్రాల్లో పెంచుతున్న సూపర్ నేపియర్, గిన్నిగ్రస్, రెడ్ నేపియర్, సీవో–3, సీవో–4, చంగల్ గడ్డితోపాటు ఆయుర్వేద మొక్కలు, షుగర్ ప్లాంట్, నల్ల పసుపు, నల్లేరు, తులసి, తిప్పతీగ తదితర పంటలను వారు పరిశీలించారు. సేంద్రియ పద్ధతిలో ఆవు పేడ, మూత్రం ఉపయోగించి పశు గ్రాసాలు పెంచినట్లయితే వాటిని తిన్న పాడి పశువులు స్వచ్ఛమైన పాలు ఇస్తాయని శ్రీనివాసరావు తెలిపారు. పశుగ్రాసాల పెంపకంలో క్రిమి సంహారిక మందులు వాడడం వల్ల పాల నాణ్యత తగ్గుతుందన్నారు. 24 రకాల మిశ్రమ విత్తనాలతో పెంచుతున్న పశుగ్రాస క్షేత్రాన్ని ఆయన పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండల రైతు సంఘం అధ్యక్షుడు అప్పారి వెంకటరమణ, రైతు బత్తుల ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ అధికారుల క్షేత్రస్థాయి పర్యటన



పదో వార్డులో పరిశీలిస్తున్న కమిషనర్ నిర్మల్‌కుమార్, కౌన్సిలర్ దుర్గాబాయి, అధికారులు

అమలాపురం టౌన్: అమలాపురం మున్సిపాలిటీ పదో వార్డులో కమిషనర్ వి.నిర్మల్ కుమార్, ఆ వార్డు కౌన్సిలర్ కొల్లాటి దుర్గాబాయి, పలు మున్సిపల్ విభాగాల అధికారులు క్షేత్ర స్థాయలో గురువారం పర్యటించి సమస్యలను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. తాగునీరు, పారిశుధ్యం తదితర సమస్యపరంగా ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మాట్లాడారు. ప్రజలు చెప్పిన పలు సమస్యల పరిష్కారానికి కమిషనర్ ఆయా విభాగాల అధికారులను ఆదేశించారు. వార్డులో చెత్త పేరుకుపోయిన ప్రాంతాలను, తాగునీరు అరకొరగా వస్తున్న ప్రాంతాల్లో అధికారుల బృందం పర్యటించి సమస్యలను గుర్తించారు. వార్డు కౌన్సిలర్ దుర్గాబాయి పలు సూచనలు చేశారు. వాటిని కూడా పరిగణనలోకి తీసుకుని సమస్యలను పరిష్కరించనున్నట్టు కమిషనర్ నిర్మల్‌కుమార్ తెలిపారు. ఈ క్షేత్రస్థాయి పర్యటనలో మున్సిపల్ డీఈఈ కె.సత్యనారాయణ, మున్సిపల్ ఏఈలు, పారిశుధ్య సూపర్‌వైజర్లు, వార్డు సచివాలయ శానిటేషన్ సెక్రటరీ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా టూ వీలర్ మెకానిక్స్ డే

అమలాపురం టౌన్: పట్టణంలోని టూ వీలర్స్ మెకానిక్స్ అందరూ స్థానిక యూనియన్ కార్యాలయం వద్ద ప్రపంచ టూ వీలర్స్ మెకానిక్స్ డేను గురువారం ఘనంగా జరుపుకొన్నారు. వరసిద్ధి వినాయక టూ వీలర్స్ మెకానిక్స్ యూనియర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో యూనియన్ అధ్యక్షుడు గుద్దుటి రెడ్డినాయుడు మాట్లాడారు. టూ వీలర్స్ మెకానిక్స్ వృతిపరంగానే కాకుండా సేవాపరంగా కూడా ముందు ఉండాలని పిలుపునిచ్చారు. కేక్ కట్ చేశారు. యూనియన్ ఉపాధ్యక్షుడు కూర్మా నరసింహరావు, కార్యదర్శి కుప్పాల శ్రావణ్‌కుమార్, కోశాధికారి గోకరకొండ బాల, యూనియన్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

అమలాపురం మండలంలో...

అమలాపురం రూరల్: మండలంలో టూ వీలర్స్ మెకానిక్ యూనియన్, వరసిద్ధి వినాయక మోటారు సైకిల్ మెకానిక్స్ వెల్ఫేర్ అసోసియేషన్ యూనియన్ ఆధ్వర్యంలో ప్రపంచ టూ వీలర్స్ మెకానిక్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ఉపాధ్యక్షుడు అధ్యక్షుడు కూర్మా నరసింహరావు, కార్యదర్శి కుప్పాల శ్రావణ్ కుమార్, కోశాధికారి గోకరకొండ బాల, సభ్యులు పాల్గొన్నారు.

ఆర్టీసీలో ఖాళీ స్థలాలకు టెండర్ల ఆహ్వానం

అమలాపురం రూరల్: కోనసీమ జిల్లాలోని ఆర్టీసీ బస్ స్టేషన్‌లోఉన్న ఖాళీ స్థలాలకు ఓఎస్ 15 ప్రాతిపదికన టెండర్ల ఆహ్వానిస్తున్నట్టు కోనసీమ జిల్లా రీజినల్ మేనేజర్ ఎస్‌టీపీ రాఘవకుమార్ తెలిపారు. మండపేట 726 చదరపు అడుగులు, అంబాజీపేట 9148 చదరపు అడుగులు ఈ టెండర్లకు సంబంధించిన ప్రీ–బిడ్ సమావేశం 8వ తేదీన 11.30 గంటలకు రాజమహేంద్రవరంలో జిల్లా పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసర్ కార్యాలయం బిడ్ సమావేశం నిర్వహించనున్నారు. 23న ఉదయం 10.30 గంటలకు విజయవాడ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ కార్యాలయంలో టెండర్లు సమర్పించాలన్నారు. వివరాలకు ఆర్టీసీ వెబ్ సైట్ లేదా సంబంధిత కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

సమష్టి నిర్ణయం మేరకే సీట్ల కేటాయింపు

యానాం: పుదుచ్చేరిలో బీజేపీ, ఎన్ఆర్ కాంగ్రెస్ ప్రభుత్వంలో నేతల నిర్ణయం మేరకే వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఎన్ని సీట్లులో పోటీ చేసేది నిర్ణయం జరుగుతుందని హోమ్‌మంత్రి, బీజేపీ జాతీయకార్యవర్గ సభ్యుడు ఎ.నమశ్శివాయం తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 2026లో సైతం ఎన్డీయే కూటమి అధికారంలోకి వస్తుందన్నారు. మంత్రులు ప్రమాణ స్వీకారం ఎప్పుడు చేసేది కేంద్రం ఆమోదం మేరకే జరుగుతుందన్నారు.

రీజెన్సీ పునఃప్రారంభానికి సహకరించాలి

యానాం: వేలాది మంది కార్మికులకు ఉపాధి కల్పించిన రీజెన్సీ సిరామిక్స్ భారీ పరిశ్రమ మళ్లీ తెరవాలంటే యానాం ప్రజల సహకారంతోనే సాధ్యమవుతుందని రీజెన్సీ సంస్థల వ్యవస్థపక చైర్మెన్ డాక్టర్ జీఎన్నాయుడు పేర్కొన్నారు. గురువారం సావిత్రినగర్ గ్రామంలో ఆయన స్థానిక ప్రజలతో ముఖాముఖి సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మూతపడిన అనంతరం 13 ఏళ్లకు తాను ఫ్యాక్టరీని పునః ప్రారంభించడానికి చర్యలు చేపట్టానని అయితే అది ఫలించలేదన్నారు. పరిశ్రమ తెరుచుకోవాలంటే ప్రజలు సాయం చేయాలన్నారు. అనంతరం 2024–25 పదో తరగతి టాపర్స్‌ను సత్కరించారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అర్ధాని దినేష్, మెల్లం చిన్న, హర్షనాగవర్ధన్ పాల్గొన్నారు.

సుంకరపాలెం గ్రామస్తుల ఆందోళన



రహదారి అధ్వానంగా మారడంతో ఆందోళన వ్యక్తం చేస్తున్న స్థానికులు

తాళ్లరేవు: సుంకరపాలెం రహదారికి మరమ్మతులు చేపట్టి ఐదు నెలలు గడవకుండానే పూర్తిగా ఛిద్రం కావడంపై గురువారం స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. యానాం–ద్రాక్షారామ ఆర్అండ్‌బీ రహదారిలో సుంకరపాలెం బైపాస్ జంక్షన్ నుంచి శివాలయం వరకు రహదారి అధ్వానంగా ఉండడంతో నాలుగు నెలల క్రితం సుమారు రూ.5 లక్షలతో రహదారికి మరమ్మతులు చేశారు. అయితే రహదారి మొత్తం ఛిద్రమై, సమస్య యథాస్థితికి రావడంతో స్థానిక ప్రజలు, వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను పరిష్కరించాలని కోరుతూ స్థానికులు ఆందోళన చేశారు. తక్షణమే అధికారులు స్పందించి రహదారిని శాశ్వత ప్రాతిపదికన అభివృద్ధి చేయాలని లక్ష్మీగణపతి వరసిద్ధి వినాయక బైపాస్ వర్తక సంఘం అధ్యక్షుడు పి. వాసు డిమాండ్ చేశారు. దీనిపై ఆర్అండ్‌బీ జేఈ లక్ష్మీప్రసన్నను వివరణ కోరగా రహదారి చెంతన డ్రైనేజీ సౌకర్యం లేకపోవడం, వర్షం నీరు రహదారిపై నిలిచిపోతుండడంతో రహదారి ఛిద్రమవుతోందని తెలిపారు. ఈ రహదారిని సీసీ రహదారిగా అభివృద్ధి చేసేందుకు ప్రతిపాదనలు పంపామని తెలియజేశారు.

9న దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయండి

యానాం: ఈనెల 9వ తేదీన దేశవ్యాప్తంగా జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని గురువారం జిల్లా సీఐటీయూ అధ్యక్షుడు దుర్గాప్రసాద్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా యానాం నియోజకవర్గ పరిధిలో వివిధ పరిశ్రమల యాజమాన్యాలకు సమ్మె నోటీసులను పంపిణీ చేశారు. కేంద్రంలో నరేంద్రమోదీ ఆధ్వర్యంలో ప్రభుత్వం వచ్చిన తర్వాత పలు చిన్నతరహా పరిశ్రమలకు రాయితీలు ఇవ్వకపోవడంతో వేలాది పరిశ్రమలు మూతపడ్డాయన్నారు. యానాంలో సైతం రీజెన్సీ, బ్లూజూమ్ ఆయిల్స్, రెడ్డీల్యాబ్, రైస్ మిల్లులు మూతపడడంతో కార్మికులకు ఉపాధి లేకుండా పోయిందన్నారు. రీజెన్సీ పరిశ్రమను పునఃప్రారంభానికి యాజమాన్యం ముందుకు వచ్చినప్పటికీ పుదుచ్చేరి ప్రభుత్వం సహకరించకపోవడం అన్యాయమన్నారు. ఈ సమ్మెలో కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు, ఆటో కార్మికులు, భవన నిర్మాణ కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఆర్థిక సాయం



దివ్యాంగుడు రాజారావును పరామర్శిస్తున్న వెంకయ్యనాయుడు

అల్లవరం: డి.రావులపాలెం సావరం పేటకు చెందిన దివ్యాంగుడు ఈతకోట రాజారావు అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ సందర్భంగా గురువారం అతనికి దివ్యాంగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వంటెద్దు వెంకయ్యనాయుడు చేతుల మీదుగా రూ.11 వేలు ఆర్థిక సాయాన్ని అందజేశారు. సావరంపేటలోని దివ్యాంగు రాజారావుని పరామర్శించి వారి కుటుంబానికి భరోసా కల్పించారు. ఆయన వెంట కోనసీమ సంక్షేమ సంఘం అధ్యక్షుడు నాగవరపు పరశురాముడు, సాధనాల విఘ్నేశ్వరరావు, బొంతు శ్రీనివాస్, పెనుమాల నాగరాజు, గొల్లపల్లి బాబి, తిక్కా బాబి, మాజీ ఎంపీటీసీ నక్కా నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

భవిత సెంటర్ పరిశీలన

అమలాపురం రూరల్: బండారులంక జెడ్పీహెచ్ఎస్ ఆవరణలోని భవిత సెంటర్‌ను కోనసీమ జిల్లా సమగ్ర శిక్ష ఏపీసీ మమ్మి సందర్శించారు. దివ్యాంగ విద్యార్థుల ప్రగతిని పరిశీలించి భవితలో అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. భవితలో జరిగే కార్యక్రమాలపై ఆమె సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని విద్యార్థులు సేవ భగవంతునికి చేసినట్టే అని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సీఎంఓ సుబ్రహ్మణ్యం, డీవైఈవో గుబ్బల సూర్యప్రకాశం, ఎంఈఓ ఎస్.దుర్గాదేవి, ఐఆర్టీలు ఎం.శ్రీనివాసరావు, జి.నానాజీ, జీ.సుబ్బలక్ష్మి పాల్గొన్నారు.

విద్యార్థి మిత్ర కిట్ల స్టాక్ పాయింట్ తనిఖీ

బండారులంక జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన విద్యార్థి మిత్ర కిట్ల స్టాక్ పాయింట్‌ను జిల్లా సమగ్ర శిక్ష అభియాన్ అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ మమ్మీ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు.

సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలి

అమలాపురం రూరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక, కర్షక, ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ దేశ వ్యాప్తంగా 9వ తేదీన సార్వత్రిక సమ్మె విజయవంతం చేయాలని యునైటెడ్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి వి.గణపతి పిలుపునిచ్చారు. సమ్మె సన్నాహాలులో భాగంగా అమలాపురం డిపోలో యునైటెడ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో గురువారం గేట్ మీటింగ్ నిర్వహించారు. కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం కార్మికులకు నష్టం కలిగించే నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే వెనక్కి తీసుకోవాలి ధర్నా నిర్వహించారు. ఔట్సోర్సింగ్ కార్మికులు, అద్దె బస్ కార్మికులను, ఆన్ కాల్డ్ డ్రైవర్లను వెంటనే రెగ్యులర్ చేయాలని డిపో కార్యదర్శి కె.రవికుమార్ డిమాండ్ చేశారు. ఆర్టీసీ కార్మికులకు ఈహెచ్ఎస్ బదులుగా పాత రిఫరల్ వైద్య విధానం అమలు చేయాలని డిమాండ్ చేశారు. కొత్తగా వచ్చే విద్యుత్ బస్సులను ఆర్టీసీ సంస్థ ఆధ్వర్యంలోనే నడపాలని కోరారు. ఎం.శివరామకృష్ణ, డి.భయ్యమ్మ, కె.శ్రీనివాసరావు, కె.గంగా శంకర మూలయ్య పాల్గొన్నారు.

ఘనంగా ఎస్వీఆర్ జయంతి

తాళ్లరేవు: ప్రముఖ నటుడు స్వర్గీయ ఎస్వీ రంగారావు 107వ జయంతిని గురువారం కోరంగలో ఘనంగా నిర్వహించారు. పంచాయతీ పరిధిలోని పెదబొడ్డు వెంకటాయపాలెంలో జరిగిన కార్యక్రమంలో ఎస్వీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఎన్టీఆర్, ఏఎన్ఆర్, ఎస్వీఆర్, మహానటి సావిత్రి కళా పరిషత్ ప్రతినిధి ఉంగరాల వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో టేకుమూడి లక్ష్మణరావు, వాడ్రేవు వీరబాబు, పి.రామలక్ష్మి, కొప్పిశెట్టి బాబి, టిళ్లపూడి నాగేశ్వరరావు, కొప్పిశెట్టి చంటి తదితరులు పాల్గొన్నారు.

టీబీ నిర్మూలనకు కృషి చేద్దాం



పశువుల్లంకలో ప్రతిజ్ఞ చేస్తున్న వైద్య సిబ్బంది

ఐ.పోలవరం: టీబీ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, దీనిపై వైద్యాధికారులు, సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారని కేసనకుర్రు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఎం.ఎస్.రాజేష్‌బాబు అన్నారు. ఐ.పోలవరం మండలం పశువుల్లంకలో టీబీ ముక్త భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గురువారం దగ్గుతో బాధపడే ఇరవై మందికి కళ్లె పరీక్షలు నిర్వహించారు. అనంతరం టీబీ వ్యాధి, సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ పెద్దిరాజు, సెక్రటరీ శ్రీనివాస రావు, ఎంపీహెచ్‌వో ఎం.వెంకటేశ్వర్లు, హెల్త్ సూపర్‌వైజర్ రమేష్‌లు పాల్గొన్నారు.

10న బ్రహ్మపురిలో గురుపూర్ణిమ

తాళ్లరేవు: రామావధూత యోగి సీతారామ్ బాబా ఆధ్వర్యంలో ఈ నెల పదో తేదీన గురుపూర్ణిమ వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్టు శిరిడీ సాయిబాబా సత్సంగ ధార్మిక సేవా సమితి ప్రతినిధులు తెలిపారు. పదో తేదీ తెల్లవారు జామున 2.30 గంటలకు మేలుకొలుపుతో ప్రారంభమై కాకడ హారతి, దత్తసాయి భరద్వాజ పాదుకలకు రుద్రాభిషేకం, ధుని పూజ, సీతారామ్‌బాబాకు పాదపూజ, గోపూజ, పల్లకీసేవ, గోదావరి మాతకు గంగాహారతి తదితర పూజలు ఘనంగా నిర్వహించనున్నట్టు తెలిపారు.